# సాక్షి హనుమకొండ

మంగళవారం | 23 | సెప్టెంబర్ | 2025

I




**మద్యం మత్తును తరిమికొడదాం**

మత్తుకు బానిసలైన వారికి చికిత్స అందించేందుకు నగరంలో పలు డీఅడిక్షన్ సెంటర్లు పనిచేస్తున్నాయి.

- IIలో▸



**కళలతో మనసుకు ఆనందం**

కళలు మనసుకు ఎంతో ఆనందం కలిగిస్తాయని, కళాకారులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు.

- IIలో▸

30.0⁰ /22.0⁰

**వాతావరణం**

జిల్లాలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### సెలవుల్లో తరగతులు నిర్వహించొద్దు

**విద్యారణ్యపురి :** దసరా సెలవుల్లో కొన్ని ప్రైవేట్ పాఠశాలలు తరగతులు నిర్వహిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని డీఈఓ వాసంతి తెలిపారు. ఈనేపథ్యంలో సోమవారం ఎంఈఓలను, సీఆర్పీలను వివిధ ప్రైవేట్ పాఠశాలలు తిరిగి ఎక్కడైనా తరగతులు నిర్వహిస్తే మూసివేయించాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర విద్యాశాఖ ఇచ్చిన ఆదేశాలను బేఖాతర్ చేసే యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### బాధితురాలికి పరామర్శ

**ఎంజీఎం:** ఎంజీఎంలో వైద్యుల నిర్లక్ష్యంతో 'ఓ' పాజిటివ్‌కు బదులు 'బి' పాజిటివ్ రక్తం ఎక్కించడం ద్వారా అనారోగ్యానికి గురైన 45వ డివిజన్ పరిధి అయోధ్యపురానికి చెందిన ఇలాసరపు జ్యోతిని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు సోమవారం పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని చింతించాల్సిన పనిలేదని బంధువులకు సూచించారు. మెరుగైన చికిత్స కోసం నిమ్స్ ఆస్పత్రికి పంపించాలని వైద్యులను ఆదేశించారు. నిర్లక్ష్యం వహించిన వైద్యులపై చర్యలు తీసుకునేలా కలెక్టర్‌తో మాట్లాడతానన్నారు.

### టీజీఓస్ మహిళా విభాగం రాష్ట్ర అదనపు చైర్‌పర్సన్‌గా శ్రీప్రియ



**హన్మకొండ:** తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ సెంట్రల్ (రాష్ట్ర) మహిళా విభాగం అదనపు చైర్‌పర్సన్‌గా కొత్త శ్రీప్రియను నియమించారు. రాష్ట్ర చైర్‌పర్సన్ డాక్టర్ జి.దీపారెడ్డి అసోసియేషన్ రాష్ట్ర కమిటీని ప్రకటించారు. హనుమకొండ సుబేదారిలోని ఎరువుల నియంత్రణ ప్రయోగశాలలో వ్యవసాయాధికారిగా పని చేస్తున్న కొత్త శ్రీప్రియ అదనపు చైర్‌పర్సన్‌గా నియమితులయ్యారు. సోమవారం హైదరాబాద్ నాంపల్లిలోని అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో రాష్ట్ర నాయకుల చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు.

### ఆర్థిక ఇబ్బందుల్లోనూ సంక్షేమ పథకాలు



**హన్మకొండ:** రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ప్రజా ప్రభుత్వం సంక్షేమ పథకాలు కొనసాగిస్తోందని వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. సోమవారం హనుమకొండలోని అంబేడ్కర్ భవన్‌లో అర్హులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను ఎంపీ కావ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అందించారు. ఈసందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ.. వరంగల్‌లో గత ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న పనులు ప్రస్తుత ప్రభుత్వంలో పూర్తవుతున్నాయన్నారు. ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ.. రాజకీయ లబ్ధి కోసం పేదలను కొంత మంది నాయకులు అస్త్రంగా మలుచుకుంటున్నారని విమర్శించారు. కబ్జాదారులు, మహిళలపై అసభ్యంగా ప్రవర్తించిన వారు మళ్లీ ముందుకు వస్తున్నారని తూర్పారబట్టారు. 135 మందికి రూ.1,35,15,600 విలువైన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు, 128 మందికి రూ.43,28,000 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు, 262 మందికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందించారు.

### నిరంతరం అధ్యయనం చేయాలి

**ఖిలా వరంగల్ :** జర్నలిస్టులు మరింత బాధ్యతగా రాణించాలంటే నిరంతరం అధ్యయనం చేయాలని టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. బసవపున్నయ్య సూచించారు. సోమవారం శివనగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో టీడబ్ల్యూజేఎఫ్ వరంగల్ జిల్లా మహాసభలు ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు పాడేటి అశోక్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేయాలన్నారు. దయాసాగర్, చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, సతీష్, రాజు, శ్రీనివాస్, సురేందర్, రాజిరెడ్డి, రమేష్, సాంబయ్య, కిషన్ నాయక్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

# ఊళ్లు దాటుతున్న యూరియా

**వాహనాన్ని అడ్డగించిన రైతులు**

- వ్యవసాయ అధికారుల తీరుపై అన్నదాతల ఆగ్రహం



శాయంపేట: పీఏసీఎస్ వద్ద యూరియా కోసం బారులుదీరిన రైతులు



పరకాల: పట్టుబడిన యూరియా బస్తాలు



శాయంపేట: యూరియాను పరిశీలిస్తున్న రవీందర్ సింగ్

**పరకాల:** రాత్రింబవళ్లు క్యూలో నిలబడితే యూరియా దొరుకుతుందో లేదో తెలియని పరిస్థితి. నిద్రాహారాలు మాని.. క్యూలో నిలబడితే ఒక్క బస్తా దొరకడం కష్టం. అలాంటిది కొందరు వ్యవసాయ అధికారులు మాత్రం తమ బంధువులకు ఇచ్చేందుకు యూరియాను వాహనాల్లో తరలిస్తున్నారు. 'ఓ వైపు పరకాల నియోజకవర్గానికి కావాల్సిన యూరియా కోటా వచ్చేసింది. కానీ కొరత అంటూ అనవసరపు రాజకీయాలు చేస్తున్నారు' అంటూ పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ప్రతిపక్షంపై ఎదురుదాడికి దిగుతున్నారు. మరోవైపు అధికారులను హెచ్చరిస్తున్నా.. పట్టించుకోకుండా నిబంధనలకు విరుద్ధంగా పొరుగు జిల్లాలు జయశంకర్ భూపాలపల్లి, కరీంనగర్ పరిధిలోని గ్రామాల రైతులకు (వ్యవసాయ అధికారుల బంధువులకు, అనుచరులకు) యూరియా తరలిస్తున్నారు. పరకాల వ్యవసాయ మార్కెట్‌లో చోటుచేసుకున్న ఈ ఘటనే ఓ సాక్ష్యమంటూ యూరియా అందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం నాగారం, పైడిపల్లి, లక్ష్మీపురం, వెంకటాపూర్, హైబోతుపల్లి గ్రామాల రైతులకు యూరియా పంపిణీ చేశారు. నాగారం గ్రామానికి చెందిన రైతులకు టోకెన్ ఇవ్వకుండా సంబంధిత గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారి బయటి వ్యక్తులకు టోకెన్లు ఇచ్చారు. ఈ విషయాన్ని గమనించిన కొందరు యూరియా దొరకని రైతులు టోకెన్లు తీసుకెళ్లిన వారిని వెంబడించారు. టోకెన్లు అందుకున్న వారు 10 యూరియా బస్తాలను నడికూడ మండల కేంద్రం మీదుగా శనిగరం గ్రామానికి తరలిస్తుండగా అడ్డగించి పట్టుకున్నారు. యూరియాను పక్కదోవ పట్టిస్తున్నారనే సమాచారంతో పరకాల పోలీసులు బొలేరో వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. నియోజకవర్గంలో యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకోవాలంటూ రెండ్రోజులుగా స్థానిక ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి అధికారులతో సమావేశమవుతున్నప్పటికీ కొందరు వ్యవసాయ అధికారులు యూరియా కొరత సృష్టిలో భాగం కావడం విశేషం.

**క్యూలో చెప్పులు, ప్లాస్టిక్ బాటిళ్లు**

**శాయంపేట:** గోదాముల వద్ద వివిధ గ్రామాల రైతులకు యూరియా పంపిణీ చేస్తున్నారని వ్యవసాయ శాఖ ఏఈఓలు తెలుపడంతో తెల్లవారుజాము నుంచే రైతులు చేరుకొని చెప్పులు, ప్లాస్టిక్ బాటిళ్లను క్యూలో పెట్టి పడిగాపులు కాశారు. పీఏసీఎస్ సిబ్బంది ఉదయం 8గంటలకు రావడంతో రైతులు అధిక సంఖ్యలో గుమిగూడడంతో తోపులాట జరిగింది. సమాచారం అందుకున్న సీఐ రంజిత్ రావు, ఎస్సై జక్కుల పరమేశ్ సిబ్బందితో చేరుకుని రైతులను క్యూలో పంపి యూరియా బస్తాలు పంపిణీ చేశారు.

**రైతులు ఆందోళన చెందొద్దు: డీఏఓ**

యూరియా కోసం రైతులు ఆందోళన చెందొద్దని జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని వ్యవసాయ గోదాం వద్ద పీఏసీఎస్ ఆధ్వర్యంలో యూరియా పంపిణీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు నానో యూరియా వాడడం వల్ల అనేక లాభాలు ఉన్నాయని తెలిపారు. రైతుల అవసరం మేరకు యూరియా పంపిణీ చేస్తామన్నారు. సహాయ వ్యవసాయ సంచాలకులు జగదీశ్వర్ రెడ్డి, టెక్నికల్ ఏఓ కమలాకర్, పరకాల ఏఓ శ్రీనివాస్, ఏఈఓ అర్చన, రైతులు ఉన్నారు.

భద్రకాళి ఆలయంలో ఉత్సవాలను ప్రారంభిస్తున్న ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, వేయిస్తంభాల ఆలయంలో బాలా త్రిపుర సుందరీదేవిగా రుద్రేశ్వరి అమ్మవారు





## వరాల తల్లి వచ్చేసింది..

**దేవీశరన్నవరాత్రులు షురూ..**

గ్రేటర్ వరంగల్ నగరంలో సోమవారం దేవీ శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. వేయిస్తంభాల ఆలయంలో రుద్రేశ్వరీ దేవిని, భద్రకాళి ఆలయంలో భద్రకాళి అమ్మవారిని బాలా త్రిపుర సుందరీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. హనుమకొండలో పద్మాక్షి అమ్మవారికి శైలపుత్రి అలంకరణలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమకొండ రెడ్డి కాలనీలో 51 అడుగుల దుర్గామాత విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఆయా ఆలయాల్లో ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ, శేషు, నాగిళ్ల శంకర్‌శర్మ, ఎల్లంభట్ల లక్ష్మణశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు.

\- హన్మకొండ కల్చరల్/హన్మకొండ అర్బన్



51 అడుగుల దుర్గమ్మ విగ్రహం

## మెరుగైన సేవలందించాలి

- జిల్లా మేనేజర్ శ్రీనివాస్

**కమలాపూర్ :** 108, 102 అత్యవసర వాహనాల సిబ్బంది ఎల్లవేళలా విధుల్లో అప్రమత్తంగా ఉంటూ రోగులకు మెరుగైన సేవలు అందించాలని హనుమకొండ జిల్లా మేనేజర్ మండ శ్రీనివాస్ సూచించారు. కమలాపూర్ ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలోని 108, 102 అంబులెన్సులను సోమవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి, పరికరాల పనితీరును సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ.. జనవరి నుంచి సెప్టెంబర్ వరకు 108 సిబ్బంది 951 మంది ప్రాణాలు కాపాడారని, 102 అంబులెన్స్ ద్వారా 3,102 మంది గర్భిణులకు సేవలు అందించినట్లు తెలిపారు. 108, 102 అంబులెన్సుల ద్వారా మండల ప్రజలకు అందిస్తున్న సేవలు, సిబ్బంది పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈఎంటీ బండ ఉపేందర్, పైలట్ కుమారస్వామి, 102 కెప్టెన్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఐలోనిలో ప్రారంభమైన శరన్నవరాత్రి ఉత్సవాలు

- తొలిరోజు శైలపుత్రి అలంకారంలో దర్శనమిచ్చిన భ్రమరాంబిక అమ్మవారు



శైలపుత్రి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన భ్రమరాంబిక అమ్మవారు

**ఐనవోలు:** మండల కేంద్రంలోని మల్లికార్జున స్వామి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు శైలపుత్రి అలంకారంలో భ్రమరాంబిక అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. సోమవారం ఆలయంలో అమ్మవారికి వేకువజామున సుప్రభాత సేవ, విఘ్నేశ్వర పూజ, శైవశుద్ధి, పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాశన, ఋత్విక్ వరుణ దీక్షాధారణ, అఖండ దీపారాధన, త్రిశూల పూజ, అంకురారోపణ, మంటపారాధన, ప్రధాన కలశ స్థాపన, అమ్మవారి నవ కలశ స్నపన సుగంధ పరిమళ ద్రవ్యాభిషేకంతో నవరాత్రి వ్రతారంభం చేసినట్లు అర్చకులు తెలిపారు. అత్యంత విశిష్టమైన అమ్మవారి నవదుర్గ అలంకరణలను తొమ్మిది రోజులు భక్తులు దర్శనం చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో చైర్మన్ కమ్మగోని ప్రభాకర్‌గౌడ్, ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకులు పాతర్లపాటి శ్రీనివాస్, ఐనవోలు మధుకర్ శర్మ, వేద పండిట్ విక్రాంత్ వినాయక్ జోషి, అర్చకులు భాను ప్రసాద్, నరేశ్, మధు, శ్రీనివాస్, దేవేందర్ పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్తలు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

# వెయ్యేళ్లు నిలబడేలా మేడారం పనులు

**పనుల పరిశీలన, మాస్టర్‌ప్లాన్ ఆవిష్కరణకు నేడు మేడారం రానున్న సీఎం రేవంత్‌రెడ్డి**

- భక్తులు, పూజారుల విశ్వాసాలకు అనుగుణంగా గద్దెల ప్రాంతం అభివృద్ధి
- రాష్ట్ర పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి ధనసరి సీతక్క



మేడారంలో ఏర్పాట్లను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న మంత్రి సీతక్క. చిత్రంలో కలెక్టర్ దివాకర టీఎస్, ఎస్పీ శబరీశ్ తదితరులు

**ములుగు/ఎస్ఎస్ తాడ్వాయి :** సమ్మక్క–సారలమ్మ కొలువైన మేడారాన్ని వెయ్యేళ్లు నిలబడేలా అభివృద్ధి పనులు చేయనున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క తెలిపారు. ఆలయ అభివృద్ధి పనుల పరిశీలన, మాస్టర్‌ప్లాన్ ఆవిష్కరణ కోసం మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి మేడారం వస్తున్నట్లు వెల్లడించారు. సోమవారం ములుగులో మంత్రి సీతక్క విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకరావడమే లక్ష్యంగా ఎన్నికల ముందు 2023 ఫిబ్రవరి 7న మేడారంలో సమ్మక్క, సారలమ్మ దీవెనలు తీసుకొని సీఎం రేవంత్‌రెడ్డి పాదయాత్ర ప్రారంభించారని తెలిపారు. 2024లో యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం నుంచి ఎన్నికల భేరి మోగించి రాహుల్ గాంధీ, ప్రియాంకగాంధీతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు. ఈ రెండు ప్రాంతాలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అత్యంత ప్రాధాన్యమిస్తూ అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఉన్నారన్నారు. మేడారానికి మంజూరైన రూ.150 కోట్ల నిధులతో మూడు నెలల్లోగా అభివృద్ధి పనులు పూర్తి చేయనున్నట్లు వివరించారు. భక్తులకు అనుగుణంగా, పూజారుల విశ్వాసాలకు అనుగుణంగా సమ్మక్క సారలమ్మ గద్దెల ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. భక్తితో, విశ్వాసంతోనే గద్దెల ప్రాంగణం చుట్టూ సాలాహారం నిర్మిస్తున్నట్లు తెలిపారు. అమ్మవార్లను దర్శించుకునే సమయంలో తొక్కిసలాటలు జరుగుతున్నాయని, ఈ క్రమంలో కొంతమంది తప్పిపోతున్నారని అలాంటి ఘటనలు జరగకుండా అందరి అభిప్రాయం మేరకు గద్దెల ప్రాంతాన్ని గ్రానైట్‌తో తీర్చిదిద్దనున్నట్లు వివరించారు. రూ.15 కోట్లతో జంపన్న వాగు నుంచి మేడారం గద్దెల వరకు రహదారిని విస్తరించి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. రూ.5కోట్లతో జంపన్నవాగుకు ఇరువైపులా గ్రీనరీతోపాటు వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. పర్యాటక ప్రదేశాలైన రామప్ప, లక్నవరం, మేడారం జాతర ప్రత్యేకతలు తెలుపుతూ వాటి కళాత్మకతను పర్యాటకులకు తెలియజేసే విధంగా గట్టమ్మ నుంచి మేడారం వరకు ఉన్న జంక్షన్‌లను అభివృద్ధి చేస్తున్నట్లు మంత్రి సీతక్క వెల్లడించారు. ఆమె వెంట కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపెల్లి రాజేందర్ గౌడ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోతు రవిచందర్, ములుగు మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి ఉన్నారు.

**మేడారంలో ఏర్పాట్ల పరిశీలన..**

మేడారాన్ని సోమవారం కలెక్టర్ దివాకర టీఎస్, ఎస్పీ శబరీశ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్, ములుగు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణితో కలిసి మంత్రి సీతక్క పరిశీలించారు. సమ్మక్క సారలమ్మ దేవతలను మంత్రి సీతక్క దర్శించుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మేడారంలో శంకుస్థాపన, పరిశీలించే పనులపై అధికారులకు పలు సూచనలు చేశారు. సీఎం రేవంత్ పర్యటనకు జిల్లాలోని అన్ని మండలాలనుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని సీతక్క పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ మహేందర్ జీ, ఆర్డీఓ వెంకటేశ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, పూజారుల సంఘం అధ్యక్షుడు జగ్గారావు, ఈఓ వీరస్వామి, ఏపీఓ వసంతరావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పరిష్కారంలో జాప్యం చేయొద్దు

**అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి**



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఆర్ఎస్ వైవీ.గణేశ్

**హన్మకొండ అర్బన్ :** ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం చేయవద్దని హనుమకొండ అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డిని అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో డీఆర్ఓ వైవీ.గణేశ్‌తో కలిసి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆయా శాఖల అధికారులు వినతుల పరిష్కారంలో జాప్యం చేయొద్దని సూచించారు. ప్రజావాణిలో వివిధ శాఖలకు సంబంధించిన మొత్తం 157 వినతులు స్వీకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్డీఓ మేన శ్రీను, సీపీఓ సత్యనారాయణరెడ్డి, హనుమకొండ, పరకాల ఆర్డీఓలు రాథోడ్ రమేశ్, నారాయణ, వివిధ శాఖల అధికారులు, తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

**సీనియర్ సిటిజన్స్ సేవలు అభినందనీయం**

**డీడబ్ల్యూఓ జయంతి**

కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే గ్రీవెన్స్‌లో పేదలకు, నిరక్షరాస్యులకు స్వచ్ఛందంగా దరఖాస్తులు రాసిపెట్టే సీనియర్ సిటిజన్స్ సేవలు అభినందనీయమని హనుమకొండ సంక్షేమ శాఖ అధికారి జయంతి కొనియాడారు. కలెక్టర్ కార్యాలయంలో ప్రతీ సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చే గ్రామీణుల నుంచి కొందరు ఎక్కువ మొత్తంలో నగదు వసూలు చేస్తుండడాన్ని గమనించి సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశంలో తీర్మానం చేసి సేవలందిస్తున్నారు. ఈ మేరకు సోమవారంతో ఈస్వచ్ఛంద సేవలు మొదలుపెట్టి సంవత్సరం గడిచిన సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి జయంతి హెల్ప్ డెస్క్ సందర్శించి వారిని అభినందించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి తేరాల యుగంధర్, కార్యవర్గ సభ్యులు మార్క రవీందర్‌గౌడ్, గుంటి సీతారాములు, జి.శ్రీనివాస్, శీలం వెంకటేశ్వర్లు, టి.శివాజీ, చిదురాల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో భారీ వర్షం



హనుమకొండ చౌరస్తాలో ప్రవహిస్తున్న వరద

**హన్మకొండ:** హనుమకొండ జిల్లాలో సోమవారం సాయంత్రం తేలికపాటి నుంచి భారీ వర్షం కురిసింది. అక్కడక్కడా విద్యుత్ అంతరాయం ఏర్పడింది. ఆటోమేటిక్ వెదర్ స్టేషన్‌లో రాత్రి 8 గంటల వరకు నమోదైన వర్షపాతం వివరాలను వాతావరణ శాఖ విడుదల చేసింది. ధర్మసాగర్‌లో 78 మిల్లీమీటర్లు, ఆత్మకూరులో 67.5, మడికొండలో 56.5, ఎల్కతుర్తిలో 51.3, భీమదేవరపల్లిలో 38, ఎల్కతుర్తిలో 32, ఐనవోలులో 31.5, కొండపర్తిలో 42.3, ఐనవోలులో 40.5, హనుమకొండ పెద్దమ్మగడ్డలో 32, శాయంపేటలో 27, దామెరలో 27.8, హసన్‌పర్తి మండలం నాగారంలో 16.3, చింతగట్టులో 32.8, పెద్ద పెండ్యాలలో 14.3, పరకాలలో 14.3, కమలాపూర్‌లో 9.5, నడికూడలో 9.3 వర్షం కురిసింది.

## భూసేకరణ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలి



వీసీలో పాల్గొన్న కలెక్టర్ స్నేహ శబరీష్, అధికారులు

**వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి**

**హన్మకొండ అర్బన్/న్యూశాయంపేట:** జాతీయ రహదారుల నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ ప్రక్రియను ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్‌లోని బీఆర్.అంబేడ్కర్ సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సూచనలిచ్చారు. ఈసందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. దసరా పండుగకు ముందే అన్ని పనులు పూర్తికావాలన్నారు. కోర్టు కేసులున్న భూములకు సంబంధించి పూర్తి వివరాలను వెంటనే ప్రభుత్వానికి పంపాలని కలెక్టర్లను ఆదేశించారు. టైటిల్ సమస్యలు ఉన్న భూముల విషయంలో పరిహారం మొత్తాన్ని డిపాజిట్ చేసి, భూములను సేకరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో హనుమకొండ కలెక్టరేట్ నుంచి కలెక్టర్ స్నేహ శబరీష్, డీఎఫ్ఓ లావణ్య, అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి, పరకాల ఆర్డీఓ నారాయణ, వరంగల్ కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా అటవీశాఖ అధికారి అనూజ్ అగర్వాల్, నర్సంపేట ఆర్డీఓ ఉమారాణి, ఏఓ విశ్వప్రసాద్, ఎన్‌హెచ్ మేనేజర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఆయుర్వేదంతో సమతుల్య జీవనం



ఆయుర్వేద వైద్యశిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

**వరంగల్ చౌరస్తా :** ఆయుర్వేదం వైద్యపద్ధతి మాత్రమే కాదని, జీవన శైలి, ఆహారం, నిద్ర, ఆచారాలు, అలవాట్లు అన్ని సమతుల్యంగా ఉండేలా మార్గదర్శనం చేస్తోందని అనంత లక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాల్ అనసూర్య, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరికిషన్ తెలిపారు. సోమవారం జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా వరంగల్ శంభునిపేట పోతన లైబ్రరీలోని పీపుల్స్ కమ్యూనిటీలో, యునైటెడ్ నేషన్స్ రిసోర్స్ సెంటర్ తెలంగాణ స్టేట్ చాప్టర్, అభ్యుదయ సేవా సమితి ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రోగం వచ్చిన తర్వాత చికిత్స చేయడం కంటే, రోగం రాకుండా కాపాడటమే ఆయుర్వేదం ప్రధాన లక్ష్యమన్నారు. సాంబమూర్తి, రాజగోవిందు, మండల పరశురాములు, వైస్ ప్రిన్సిపాల్ అశోక్ కుమార్, డాక్టర్ శ్రవణ్, ఈశ్వర్, జగన్ మోహనాచార్య, డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

**మడికొండ :** కాజీపేట మండలం మడికొండ శివారులోని దుర్గాబాయి మహిళా శిశువికాస కేంద్రంలో శిక్షణకు ఆసక్తి ఉన్న మహిళలు దరఖాస్తులు చేసుకోవాలని ప్రాంగణం మేనేజర్ జయశ్రీ ఒక ప్రకటనలో కోరారు. టైలరింగ్, కంప్యూటర్, కమ్యూనిటీ హెల్త్ వర్కర్ కోర్సుల్లో రెండు నెలలపాటు ఉచిత శిక్షణ కోసం గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని చదువు మానేసిన 18 నుంచి 35 ఏళ్లలోపు మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అభ్యర్థులు 8వ తరగతి, 10వ తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. కోర్సుకు పదో తరగతి మెమో, ఆధార్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, 4 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో అక్టోబర్ 6 లోపు దరఖాస్తులు అందజేయాలని మేనేజర్ తెలిపారు. పూర్తి వివరాలకు 76600 22525, 7660022526లో సంప్రదించాలని కోరారు.

### దరఖాస్తుల ఆహ్వానం

**మహబూబాబాద్ అర్బన్ :** ఉమ్మడి వరంగల్ జిల్లాలో 'మేరా యువ భారత్' యువజన సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించడానికి యువజన సంఘాల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మేరా యువ భారత్ డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేష్ సోమవారం తెలిపారు. యువజన సంఘంలోని సభ్యులు 18నుంచి 29 సంవత్సరాల లోపు ఉండాలన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్నా.. చేసుకోలేకపోయినా ఆసక్తి గల యువజన సంఘాల నాయకులు తమ ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలను యువజన సంఘాల పత్రాలతో హనుమకొండలోని న్యూ బస్టాండ్ సమీపంలో మేరా యువ భారత్ కార్యాలయంలో ఈనెల 27వ తేదీలోపు నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 0870 29 58776 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

### అప్పల బాధతో రైతు ఆత్మహత్య

● పంథినిలో ఘటన


శశికుమార్ (ఫైల్)

**ఐనవోలు :** అప్పుల బాధతో ఓ రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం పంథినిలో చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబీకుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గీత కార్మికుడు సమ్మెల శశికుమార్ (47) కొంత భూమి కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. ఇటీవల తన కూతురు వివాహం కోసం రూ.6 లక్షలు అప్పు చేశాడు. వ్యవసాయంతోపాటు కూతురు పెళ్లికి చేసిన ఈ అప్పు ఎలా తీర్చాలని భార్యతో చెప్పి మనోవేదనకు గురయ్యేవాడు. ఈ క్రమంలో సోమవారం కుటుంబీకులు లేని సమయంలో ఇంట్లో ఉరేసుకున్నాడు. పని నిమిత్తం బయటకెళ్లిన ఇంటికొచ్చిన తన భార్య, కూతురు చూసి కేకలు వేశారు. చుట్టు పక్కల వారిని పిలిచి శశికుమార్‌ను కిందికి దింపి ఎంజీఎం తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈఘటనపై మృతుడి భార్య సంగీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఐనవోలు ఎస్‌హెచ్‌ఓ తెలిపారు.

### కేయూ ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు

**కేయూ క్యాంపస్:** కాకతీయ విశ్వవిద్యాలయంలోని వివిధ విభాగాల్లో పరిశోధకులకు ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు అక్టోబర్ 16 నుంచి నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి రాజేందర్ తెలిపారు. అక్టోబర్ 16న పేపర్–1 రీసెర్చ్ మెథడాలజీ, 18న పేపర్–2 ఎలెక్టివ్ పేపర్ (స్పెషలైజేషన్) పరీక్షలు నిర్వహిస్తారని ఆయన పేర్కొన్నారు. ఆయా తేదీల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటలవరకు పరీక్షలు నిర్వహిస్తారని ఆయన తెలిపారు.




సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

వధువు కావలెను

■ పురుషునికి 20 నుండి 30 సం॥లోపు రెండో వివాహం, అర్థం చేసుకునే వధువు కావలెను. సంప్రదించండి॥ సెల్: 8500874860, 9347672025.
[SCA25008362]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
వరంగల్ : 9705748198, 9866574715
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 7702221602
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

# మద్యం మత్తును తరిమికొడదాం..

**సరదాగా మొదలై.. బానిసగా మారుతున్న మహమ్మారి**
● వ్యసన పరుల్లో అత్యధికులు యువతే
● డీఅడిక్షన్ సెంటర్‌లో పెరుగుతున్న సంఖ్య



**మద్యం మహమ్మారికి బానిసవుతున్న యువత..**

నేటి యువతకు మద్యం తాగడం సరదా అనిపిస్తోంది. అలా సరదాగా మొదలైన అలవాటు.. కొద్ది రోజుల్లోనే మద్యం మహమ్మారికి బానిసలవుతున్నారు. ఇటీవల మద్యానికి డ్రగ్స్ తోడైంది. ఓ వైపు మద్యం, మరో వైపు డ్రగ్స్ అనేక కుటుంబాలను వీధిన పడేస్తున్నాయి. మత్తులో నేరాలకు పాల్పడుతూ భవిష్యత్‌ను అంధకారం చేసుకున్న వారు ఎందరో ఉంటే.. మత్తుకు బలైపోతున్న వారు అనేక మంది ఉంటున్నారు. సమాజంలో చైతన్యం వస్తున్నా రోజురోజుకూ మద్యం, డ్రగ్స్‌కు బానిసలుగా మారుతున్న వారి సంఖ్య పెరుగుతుందే తప్పితే తగ్గడం లేదని పలు సర్వేలు చెబుతున్నాయి.

**హన్మకొండ చౌరస్తా:** స్నేహితుడికి కుమారుడు జన్మిస్తే దావత్.. పెళ్లి చేసుకుంటే దావత్.. సెలవు వస్తే దావత్.. చివరికి ఇంట్లో ఎవరైనా చనిపోతే ఓదార్చేందుకు దావత్. ఇలా సందర్భం ఏదైనా మద్యంలో మునగాల్సిందే. ఫలితంగా దైనందిన జీవితంలో మత్తు భాగస్వామిగా మారిపోయింది. ఈ క్రమంలో మత్తుకు బానిసలైన వారికి చికిత్స అందించి పూర్వస్థితికి తీసుకొచ్చేందుకు నగరంలో పలు రీహాబిలేషన్, డీఅడిక్షన్ సెంటర్లు పనిచేస్తున్నాయి. ఈ సెంటర్లలో ఎలాంటి చికిత్స అందిస్తారు..ఎన్ని రోజులు ఇస్తారు.. మద్యం తాగిన వ్యక్తిలో ఎలాంటి మార్పులు వస్తాయనే తదితర అంశాలపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

**మద్యానికి బానిసైన వారి లక్షణాలు..**
ఆలోచనలు, భావోద్వేగాలు ఇవన్నీ నిరంతరం ఆ వ్యక్తిని తాగుడుకు ప్రేరేపిస్తుంటాయి. కుటుంబ ఆర్థిక స్థితి, వృత్తి, సామాజిక విలువలు, వ్యక్తిత్వం, ఆధ్యాత్మిక చింతన పూర్తిగా నాశనమవుతున్నాయని తెలిసినా అతని శరీరం , మనసు తాగుడునే కోరుకుంటుంది. మద్యం లేకుండా ఉండలేడు.

**కారణాలు ..**
వారసత్వ ధోరణి, వ్యక్తిగత సమస్యలు, ఆల్కహాల్‌లోని ఇథనాల్, పొగాకులో ఉండే నికోటిన్ ప్రభావం, పరిసరాల ప్రభావంతో మద్యానికి బానిసలవుతారు.

**చికిత్స విధానం..**
మద్యం, డ్రగ్స్‌కు అడిక్ట్ అయిన వారి మానసిక, శారీరక ప్రవర్తనను బట్టి రెండు రకాల చికిత్స అందిస్తారు. అందులో మొదటిది డీఅడిక్షన్ సెంటర్‌లో అడ్మిట్ చేసుకుని చికిత్స అందించడం. రెండోది ప్రతీ పది రోజులకోసారి చికిత్స అందిస్తూ పర్యవేక్షించడం. రీహాబిలేషన్, డీఅడిక్షన్ సెంటర్‌లో అడ్మిట్ చేసుకున్న వ్యక్తికి సమారు మూడు నెలల పాటు చికిత్స అందిస్తారు. క్లినిక్ సైక్రియాటిస్టు, సైకాలజిస్టు, కౌన్సిలర్లతో రోగికి కౌన్సెలింగ్ నిర్వహించి మానసిక పరివర్తన కలిగించేందుకు కృషి చేస్తారు. కుటుంబీకులను సైతం పిలిపించి వారికి కూడా కౌన్సెలింగ్ ఇస్తారు. మానసిక వైద్యంతో పాటు శారీరకంగా వచ్చిన వ్యాధులకు చికిత్స అందిస్తారు. రోజూ ఉదయం, సాయంత్రం డాక్టర్ పరీక్షించి సరైన మందులు ఇస్తారు.

**ముందుబాబుల్లో రకాలు..**

**సోషల్ డ్రింకర్:** ఎప్పుడో ఒకసారి. పరిస్థితులకు అనుగుణంగా తాగుతాడు.

**డెయిలీ డ్రింకర్ :** ఈ వ్యక్తి రోజు పరిమితిగా తాగుతూ ఆహారం తీసుకుంటూ తన పని తాను చేసుకుంటాడు.

**ఆల్కహాలిక్:** ఈ వ్యక్తి సమయం, సందర్భం, ప్రదేశాలతో సంబంధం లేకుండా ఎప్పుడు పడితే అప్పుడు అదుపు లేకుండా తాగుతాడు. తాగే ప్రతీ వ్యక్తి మద్యానికి బానిస కాదు. కేవలం 18 నుంచి 20 శాతం మంది మాత్రమే బానిసలవుతారు.

**అశాస్త్రీయ పద్ధతులను ఆశ్రయించొద్దు**



మద్యం అలవాటు మాన్పించేందుకు చాలా మంది అశాస్త్రీయ పద్ధతుల వైపు వెళ్తున్నారు. అవి ఫలితాలను ఇవ్వకపోగా ఆర్థిక నష్టంతోపాటు ప్రాణాలకే ప్రమాదం. డీఅడిక్షన్ థెరపి ద్వారా శాశ్వతంగా మద్యానికి దూరం చేస్తూ సంపూర్ణ ఆరోగ్యవంతుడిగా తీర్చిదిద్దొచ్చు. 25 సంవత్సరాల క్రితం హెల్పింగ్ హ్యాండ్ సొసైటీని స్థాపించాం. దశాబ్దకాలంగా వ్యసనపరుల సంఖ్య పెరుగుతూనే ఉంది. అందులో వంశపారపర్యంగా 25శాతం ఉంటే మిగతా 75శాతం సమాజంలోని పరిస్థితుల ప్రభావమే.

పి.రాము, డీఅడిక్షన్ థెరపిస్ట్, డైరెక్టర్, హెల్పింగ్ హ్యాండ్ సొసైటీ, హనుమకొండ

**స్నేహితులతో గంజాయి అలవాటైంది**



హనుమకొండలోని ఓ ప్రైవేట్ కాలేజీలో డిగ్రీ చదువుతున్నా. సంవత్సరం క్రితం స్నేహితులు గంజాయి తాగడం అలవాటు చేశారు. కొద్దికొద్దిగా తీసుకునే వాడిని. కొద్ది రోజులకే అది లేకుంటే శరీరమంతా వణుకొచ్చేది. మెదడు పనిచేసేది కాదు. రెండు నెలలుగా చికిత్స తీసుకుంటున్నా. ఇప్పుడిప్పుడే ఆ ఆలోచనలు దూరమవుతున్నాయి.

-అఫ్జల్, డిగ్రీ విద్యార్థి, రంగశాయిపేట

**రోజూ మద్యం తాగనిదే నిద్రపట్టేది కాదు**



రోజూ మద్యంతోపాటు పొగాకు ఉత్పత్తులు తీసుకునేవాడిని. మద్యం కొంచెం తక్కువైనా నిద్ర పట్టేదికాదు. చేతులు వణికేవి. ఊపిరి ఆగినట్లు అనిపించేది. పదేళ్ల క్రితం సరదాగా తాగేవాడిని. ఆ తర్వాత మద్యం లేకుండా ఒక్క రోజు కూడా ఉండని స్థితికి చేరుకున్నా. మూడు నెలలుగా చికిత్స తీసుకుంటున్నా. ఇప్పుడు అలాంటి ఆలోచనలే లేవు.

-రమేశ్, వంటమనిషి, భూపాలపల్లి

## ఫుడ్ స్ట్రీట్ మేళాను వినియోగించుకోవాలి

● మేయర్ సుధారాణి, కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్


శిక్షణలో మాట్లాడుతున్న మేయర్ సుధారాణి, పక్కన కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

**వరంగల్ అర్బన్:** నగరంలోని వీధి వ్యాపారులు ఫుడ్ స్ట్రీట్ మేళాను వినియోగించుకోవాలని మేయర్ గుండు సుధారాణి కోరారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో ఫుడ్ స్ట్రీట్ వ్యాపారులకు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ఆధ్వర్యంలో ఆహార భద్రత ప్రమాణాలపై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి మేయర్, కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ హాజరై మాట్లాడారు. కొత్తగా వ్యాపారాలు నిర్వహించుకోవాలనుకునే వ్యాపారులు 17నుంచి అక్టోబర్ 2వతేదీ వరకు నిర్వహించే లోక కల్యాణ్ మేళాలో తమ పేరు నమోదు చేసుకుని అందించే రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా మెప్మా పీడీ జోనా, డీఎంసీ రజిత రాణి, రమేశ్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ఎస్టీపీలకు స్థలాలు గుర్తించండి**
సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్టీపీ) ఏర్పాటుకు అనువైన స్థలాలు గుర్తించాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. సోమవారం 62వ డివిజన్ కాజీపేట ప్రాంతంలో కమిషనర్ స్థలాలను పరిశీలించారు. రహమత్ నగర్‌లో ఎస్టీపీ ఏర్పాటు సాధ్య, సాధ్యాలపై నివేదిక అందజేయాలని ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులకు సూచించారు. గ్రీవెన్స్‌లో అందిన సమస్యలపై కమిషనర్ ఆరా తీసి, స్థానికులతో మాట్లాడారు. కార్పొరేటర్లు, అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## రెండు బైక్‌లు ఢీ..

● యువకుడి మృతి.. సిద్ధాపురంలో ఘటన


నాగరాజు (ఫైల్)

**హసన్‌పర్తి:** రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన హసన్‌పర్తి మండలం సిద్ధాపురంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. హసన్‌పర్తి మండలం భైరాన్‌పల్లికి చెందిన జక్కుల నాగరాజు(24)ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో విధులు నిర్వహిస్తున్నాడు. ఆదివారం సాయంత్రం బైక్‌పై అర్వపల్లి నుంచి భైరాన్‌పల్లికి బయలుదేరాడు. సిద్ధాపురం ఎస్‌బీఐ వద్దకు చేరుకోగా ఎదురుగా ద్విచక్రవాహనం వేగంగా వచ్చి నాగరాజు బైక్‌ను ఢీ కొంది.ఈఘటనలో నాగరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా, నాగరాజు మృతదేహాన్ని వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు సందర్శించారు. ఈ సందర్భంగా మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రమాద వివరాలు తెలుసుకున్నారు.

**నర్సంపేటలో ఆగి ఉన్న లారీని ఢీకొని వ్యక్తి..**
**నర్సంపేట రూరల్ :** బైక్.. ఆగి ఉన్న లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం నర్సంపేట అయ్యప్పదేవాలయం సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. నర్సంపేట మండలం మహేశ్వరం గ్రామానికి చెందిన పాయిరాల శంకర్ (40) ఓ ప్రైవేట్ పాఠశాలలో వ్యాన్ నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. వ్యక్తిగత పని నిమిత్తం బైక్‌పై మహేశ్వరం నుంచి నర్సంపేటకు వచ్చాడు. తిరిగి స్వగ్రామం వెళ్తుండగా అయ్యప్పదేవాలయం సమీపంలో రోడ్డు పక్కనే ఆగి ఉన్న లారీని ఢీకొనడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న ఎస్సై రవికుమార్ ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య రాజ్యలక్ష్మి, కుమారుడు, కుమార్తెలు ఉన్నారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## పేద, మధ్య తరగతికి జీఎస్టీ పండుగ


మాట్లాడుతున్న రవికుమార్, పక్కన నాయకులు

**వరంగల్ చౌరస్తా :** ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేదల సంక్షేమమే ధ్యేయంగా నిర్ణయాలు తీసుకుని ముందుకెళ్తున్నారని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. సోమవారం వరంగల్ ఎల్‌బీ నగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో నెక్స్ జెన్ జీఎస్టీ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ హాజరై మాట్లాడారు. పేదలు, రైతులు, విద్యార్థులు, మధ్యతరగతి కుటుంబాల జీవితాలను మోదీ ప్రభుత్వం సులభతరం చేస్తోందన్నారు. పండుగల సమయంలో పేద కుటుంబాలకు ఉపశమనం కలుగుతుందన్నారు. కాంగ్రెస్ పాలనలో పెరిగిన ధరలు, పన్నుల భారం వల్ల ఇబ్బందులు పడుతున్న సామాన్య ప్రజలకు మోదీ జీఎస్టీ సంస్కరణలు ఊరట కలిగిస్తున్నాయన్నారు.రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వన్నాల వెంకటరమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, మల్లాడి తిరుపతిరెడ్డి, ఉపాధ్యక్షుడు గడల కుమార్, పట్టాపురం ఏకాంతం గౌడ్, నాయకులు కూచన క్రాంతికుమార్, వడ్డేపల్లి నరసింహులు, సముద్రాల పరమేశ్వర్, బైరి మురళీకృష్ణ, మార్టిన్ లూథర్, కందిమల్ల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్‌నగర్‌లో రెండిళ్లలో చోరీలు..

● నిద్రిస్తున్న మహిళ మెడ నుంచి 4 తులాల బంగారు ఆభరణాలు అపహరణ

**ఖిలా వరంగల్ :** మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధి వరంగల్ ఉర్సు గుట్ట సమీపం బీఆర్‌నగర్ కాలనీలోని రెండు ఇళ్లల్లో దొంగలు చోరీలకు పాల్పడ్డారు. ఇన్‌స్పెక్టర్ బొల్లం రమేశ్ కథనం ప్రకారం.. బీఆర్‌నగర్‌లో కాలనీలోని నిర్మాణం ఉన్న భవనంలో వాచ్‌మెన్ లేకపోవడంతో అతడి స్థానంలో హనుమకొండ అడ్వకేట్ కాలనీకి చెందిన గుగులోత్ మంజుల, శంకర్ ఆదివారం నిద్రిస్తున్నారు. ఈ క్రమంలో దుండగులు అర్ధరాత్రి సమయంలో మంజుల మెడలోని 3.1/2 తులాల బంగారు పుస్తెలు తాడు, కమ్మలు, 0.2 గ్రాముల బంగారు మాటీలు అపహరించారు. అలాగే, కొంగరు అశోక్ ఇంట్లోకి చొరబడి రూ.12 వేల విలువైన మొబైల్ ఫోన్‌ను చోరీ చేశారు. ఇదిలా ఉండగా బీఆర్‌నగర్‌కు చెందిన బానోత్ గిరిజ ఇంట్లో దుండగులు ప్రవేశించి బీరువాలోని రూ.18వేల నగదు, 25 గ్రాముల పుస్తెల తాడు, రూ.10 వేల విలువైన ఫోన్‌ను అపహరించారు. బాధితుల సమాచారం మేరకు పోలీసులు సోమవారం ఉదయం ఘటనాస్థలాలకు వెళ్లారు. చోరీ జరిగిన మూడు ఇళ్లను క్షుణ్ణంగా పరిశీలించి వివరాలు సేకరించారు. బాధితులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ రమేశ్ తెలిపారు.

## ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలకు సీఎం క్షమాపణ చెప్పాలి

● మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి


విలేకరులతో మాట్లాడుతున్న పెద్ది సుదర్శన్‌రెడ్డి

**హన్మకొండ:** ఎంగిలిపూల బతుకమ్మ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతోపాటు ముగ్గురు మంత్రులు బతుకమ్మను, ఆడపడుచులను అవమానపరిచారని, సీఎం రేవంత్‌రెడ్డి ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలకు క్షమాపణ చెప్పాలని మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంగిలిపూల బతుకమ్మను ఒక మంత్రి సజ్జల బతుకమ్మ అని, మరో మంత్రి సద్దుల బతుకమ్మ అని వ్యాఖ్యానించడంతో పాటు ఆరు గ్యారంటీల పాటలు, రేవంత్ రెడ్డి పాటలు వేసి మహిళలను, బతుకమ్మను అవమానపరిచారన్నారు. సకాలంలో యూరియా లేక పంటలు ఎర్రబారుతున్నాయని, దిగుబడి తగ్గి రైతులు నష్టపోనున్నారన్నారు. దేవుళ్ల మీద రేవంత్ ఒట్టు వేసి మాటతప్పడం వల్లే రాష్ట్రంలో అశాంతి, ప్రకృతిలో మార్పులు జరుగుతున్నాయన్నారు. రాష్ట్ర రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, నాయకులు లక్ష్మీనారాయణ, బీరవెల్లి భరత్ కుమార్ రెడ్డి, తాళ్లపల్లి జనార్దన్ గౌడ్, పులి రజనీకాంత్ పాల్గొన్నారు.

## బతుకమ్మ ఆడుతూనే అనంతలోకాలకు..

● గుండెపోటుతో వివాహిత మృతి

**కొత్తగూడ:** బతుకమ్మ ఆట ఆ డుతూనే ఓ వివాహిత అనంతలోకాలకు చేరింది. గుండెపోటుతో మృతి చెందింది. ఈ ఘటన ఆదివారం మండలంలోని ఎంచగూడెంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన శెట్టి మౌనిక(30) గ్రామస్తులతో కలిసి బతుకమ్మ ఆడుతోంది. ఈ క్రమంలో గుండెపోటుకు గురై కుప్ప కూలింది. దీంతో వెంటనే హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలికి భర్త పరశురాం, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. కాగా, అమ్మా.. ఇంకా పడుకున్నావేంది లే అంటూ ఆ చిన్నారులు తల్లిని తట్టి లేపుతుండడం చూసి ప్రతీ ఒక్కరూ కన్నీరుమున్నీరుగా విలపించారు

## ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ పరీక్షలు షురూ

**విద్యారణ్యపురి :** ఓపెన్ స్కూల్ టెన్త్ , ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో టెన్త్ పరీక్షలకు 192 మందికి 142 మంది విద్యార్థులు హాజరుకాగా ఇంటర్మీడియట్ పరీక్షకు 273 మందికి 195 మంది విద్యార్థులు హాజరయ్యారని ఓపెన్ స్కూల్ ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ సదానందం తెలిపారు.

## కళలతో మనసుకు ఆనందం


మాట్లాడుతున్న ఎంపీ కడియం కావ్య


రాణి రుద్రమదేవి పద్యనాటకం ప్రదర్శన

● వరంగల్ ఎంపీ కడియం కావ్య
● ముగిసిన కాకతీయ నృత్యనాటకోత్సవాలు

**హన్మకొండ కల్చరల్ :** కళలు మనసుకు ఎంతో ఆనందం కలిగిస్తాయని, కళాకారులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. తెలంగాణ ప్రభుత్వ సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో రెండు రోజుల పాటు జరిగిన కాకతీయ నృత్యనాటకోత్సవాలు సోమవారం ముగిశాయి. ఈ మేరకు రెండో రోజు కార్యక్రమంలో భాగంగా ఎంపీ కడియం కావ్య ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతిప్రజ్వలన చేసి నాటకోత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రవీంద్రభారతికి దీటుగా కాళోజీ కళాక్షేత్రాన్ని పూర్తిచేసి ప్రారంభించిన ఘనత రేవంత్‌రెడ్డి ప్రభుత్వానిదేనన్నారు. అకాడమీ చైర్‌పర్సన్ అలేఖ్య పుంజాల మాట్లాడుతూ కళలను కాపాడేవారికి ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని, ప్రతీ జిల్లాలో ఇలాంటి ఉత్సవాలు నిర్వహిస్తామని ప్రకటించారు. ముందుగా గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గద్దర్ జీవన సంఘర్షణ పాటలు వినిపించారు. అనంతరం వరంగల్‌కు చెందిన తెలంగాణ డ్రమాటిక్ అసోసియేషన్ కళాకారులు ప్రదర్శించిన రాణి రుద్రమదేవి పద్యనాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. నాటకసమాజాల రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల సదానందం, అకాడమీ ఓఎస్డీ ఆర్. వినోద్‌కుమార్ పర్యవేక్షించారు.

## సుంకాన్ని ఎత్తివేయడానికి యూరియా కొరత

● హైకోర్టు రిటైర్డ్ జడ్జి బి.చంద్రకుమార్


మాట్లాడుతున్న హైకోర్టు రిటైర్డ్ జడ్జి చంద్రకుమార్

**ఖిలా వరంగల్/ వరంగల్ చౌరస్తా:** వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించడానికి కేంద్ర ప్రభుత్వం 11శాతం విదేశీ పత్తి దిగుమతి సుంకాన్ని ఎత్తివేయడానికే యూరియా కొరత సృష్టించిందని హైకోర్టు రిటైర్డ్ జడ్జి చంద్రకుమార్ ఆరోపించారు. ఈ మేరకు సోమవారం వరంగల్ అబ్బనికుంటలోని తెలంగాణ రైతు సంఘం భవనంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సోమిడి శ్రీనివాస్ అధ్యక్షతన పత్తి రైతుల సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భారత వాణిజ్య విధాన రూపకల్పన సందర్భంగా ఆగస్టు 7న భారత రైతుల ప్రయోజనాలపై రాజీపడబోమని మోదీ ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం వేడుకల్లో రైతులు, పశుపెంపకందారులు, మత్స్యకారులు రక్షణకు తమ ప్రభుత్వం అడ్డు గోడగా నిలుస్తామని ప్రకటించిందన్నారు. కానీ నాలుగు రోజుల్లోనే ఆగస్టు 19న పత్తి దిగుమతులపై విధిస్తున్న 11 సుంకాన్ని మొదట అక్టోబర్ 21 వరకు పొడిగించిందన్నారు. తద్వారా పత్తి రైతుల ప్రయోజనాలను పణంగా పెట్టి టెక్స్‌టైల్స్ మిల్లు యాజమాన్యాలకు మద్దతు ఇచ్చారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు వ్యవసాయరంగానికి పెద్దపీట వేయాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ ప్రొఫెసర్ కె.వెంకట్ నారాయణ మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టాలని చేసిన మూడు నల్లచట్టాలకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా పోరాటాలు చేసి విజయం సాధించామన్నారు. రైతు సంఘం నేతలు రాజయ్య, రామ్మూర్తి, హుస్సేన్, భాస్కర్, నేతి వెంకన్న, నర్సింహ, ఆశాల రెడ్డి, రుద్ర ప్రసాద్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు

## టేకులతండాలో పసిపాప మాయం...!

● రూ.50వేలకు విక్రయించినట్లు ప్రచారం

**నర్సంపేట:** మూడు నెలల పసిపాప మాయమైంది. రూ.50వేలకు విక్రయించినట్లు తెలిసింది. ఈ ఘటన వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం టేకులకుంటతండాలో సోమవారం వెలుగులోకి వచ్చింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. ఇదే తండా కు చెందిన వాంకుడోతు యాకూబ్ భార్య మౌనిక జూలై 17వ తేదీన నర్సంపేట ఏరియా ఆస్పత్రిలో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. వారం రోజుల తర్వాత ఆమెను పసిపాపతో సహా డిశ్చార్జ్ చేసుకొని కుటుంబ సభ్యులు ఇంటికి తీసుకెళ్లారు. ఈనెల 18వ తేదీ నుంచి పాప ఇంటి వద్ద కనిపించడం లేదు. ఈ విషయం స్థానిక అంగన్‌వాడీ టీచర్ వీరమ్మకు తెలియడంతో దీక్షకుంట్ల క్లస్టర్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హేమలతకు సమాచారం అందించింది. ఆమె టేకులకుంటతండా గ్రామానికి చేరుకొని సోమవారం తల్లి మౌనికను విచారణ చేపట్టింది. నా భర్త యాకూబ్ రూ.50వేలకు నా బిడ్డను అమ్మకం చేపట్టాడని ఒప్పుకున్నట్లు తెలిసింది. దీంతో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హేమలత టేకులకుంటతండాలో మూడు నెలల పసిపాప కనిపించడం లేదని ఆమె ఆచూకీ కనుక్కొని అప్పగించాలని చెన్నారావుపేట పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. గతంలో వీరికి కుమారుడు, కుమార్తె సంతానం. మూడవ సంతానంలో మళ్లీ పాప జన్మించడంతో అమ్మినట్లు ప్రచారం సాగుతోంది.

## 8 నుంచి ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, బయోటెక్నాలజీ 4వ సెమిస్టర్ పరీక్షలు

**కేయూ క్యాంపస్:** కాకతీయ యూనివర్సిటీ పరిధిలో అక్టోబర్ 8వ తేదీనుంచి ఎమ్మెస్సీ ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ, బయోటెక్నాలజీ కోర్సుల నాలుగో సెమిస్టర్ పరీక్షలు (న్యూసిలబస్) నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి కె. రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి పి. శ్రీనివాస్ సోమవారం తెలిపారు. 8న పేపర్ –1 ఇంగ్లిష్ లాంగ్వేజ్, 10న పేపర్–2 సెకండ్‌లాంగ్వేజ్, 14న పేపర్–3 ఫిజిక్స్, బయోటెక్నాలజీ, 16న పేపర్–4 కెమిస్ట్రీ, 18న పేపర్–5 కెమిస్ట్రీ, 23న పేపర్–6 బయాలజీ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఆయా తేదీల్లో పరీక్షలు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు.

**ఓల్డ్ సిలబస్ పరీక్షలు ఇలా**
కేయూ ఎమ్మెస్సీ ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ, బయోటెక్నాలజీ కోర్సుల నాలుగో సెమిస్టర్ పరీక్షలు(ఓల్డ్ సిలబస్) అక్టోబర్ 8 నుంచి నిర్వహించనున్నట్లు పరీక్షల విభాగం అధికారులు తెలిపారు.అక్టోబర్ 8న పేపర్–1 కమ్యూనికేషన్ స్కిల్స్, 10న పేపర్–2 ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌అండ్ మేనేజ్‌మెంట్ ప్రాక్టీసెస్, 14న పేపర్–3 కంప్యూటర్ సైన్స్, 16న పేపర్–4 మ్యాథ్‌మెటిక్స్, 18న పేపర్–5 బయాలజీ, 23న పేపర్–6 కెమిస్ట్రీ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఈ పరీక్షలు మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

### సీపీని కలిసిన క్రైం అదనపు డీసీపీ



సీపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న అదనపు డీసీపీ బాలస్వామి

**వరంగల్ క్రైం:** వరంగల్ పోలీస్ కమిషనరేట్ క్రైం, ఆపరేషన్స్ అదనపు డీసీపీగా బాధ్యతలు స్వీకరించిన బాలస్వామి సోమవారం వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేశారు. గతంలో బాలస్వామి వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో ట్రాఫిక్ ఏసీపీగా పనిచేశారు.

## అట్రాసిటి కేసు నమోదు చేయాలి

● బదిలీ కాదు వెంటనే సస్పెండ్ చేయాలి
● దళిత సంఘాల నాయకులు


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

**హన్మకొండ అర్బన్:** హనుమకొండ కలెక్టరేట్‌లో దళిత మహిళపై అత్యాచార యత్నానికి పాల్పడిన నిందితుడిని సస్పెండ్ చేయకుండా, కేవలం బదిలీతో సరిపెట్టి నిర్లక్ష్యం వహించడం సరైంది కాదు.. కామాంధుడిపై వెంటనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని జాతీయ మాల మహానాడు ఉపాధ్యక్షుడు మన్నే బాబూరావు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు పుట్ట రవి, దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ స్నేహశబరీష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దళిత ఉద్యోగులు, మహిళ ఉద్యోగస్తులకు కార్యాలయాల్లో భద్రత కరువైందని పేర్కొన్నారు. కామాంధుడిపై విచారణ చేపట్టి వారం రోజుల్లో చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. కేయూ జాక్ చైర్మన్ మంద వీరస్వామి, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు అంకేశ్వరపు రాంచందర్, డీబీఎఫ్ రాష్ట్ర మహిళ నాయకురాలు బొర్ర సంపూర్ణ, జిల్లా అధ్యక్షుడు కొమ్ముల కరుణాకర్, ప్రధాన కార్యదర్శి మేకల అనిత, నాయకులు నమిండ్ల రవీందర్, రవి కుమార్, అనిల్, మల్లం రాజ్ కుమార్, మాదాసి అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

### కలెక్టరేట్ ఘటనపై నోటీసులు

పది రోజుల క్రితం కలెక్టరేట్‌లో ఓ మహిళా ఉద్యోగి విషయంలో జరిగిన విషయాలపై ఏర్పాటైన ఇంటర్నల్ కంప్లైంట్ కమిటీ సోమవారం సాయంత్రం సమావేశమైంది. ఘటనకు సంబంధించి ప్రాథమిక వివరాలపై చర్చించిన ప్రతినిధులు ఫిర్యాదుదారురాలితోపాటు నిందితుడిని కమిటీ ఎదుట హాజరు కావాలని తేదీ, సమయం చెప్పి నోటీసులు జారీ చేశారు. అదే విధంగా తమ వాదనల సమర్థన కోసం వారి వద్ద ఉన్న సాక్ష్యాలు కమిటీకి అందజేయాలని నోటీసుల్లో పేర్కొన్నారు.



● ఆస్కార్ ఎంట్రీ



‘జిన్ షిన్ జ్యుషు’ అనేది జపనీస్ ఎనర్జీ హీలింగ్ టెక్నిక్. ఒత్తిడి, ఆందోళన తగ్గించడానికి, సుఖ నిద్రకు ఇది సహాయపడుతుందని ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ హీలింగ్ అండ్ కేరింగ్ అధ్యయనం తెలియజేసింది. పడుకోవడానికి కొద్దిసేపు ముందు చేతి బొటనవేలు, కాలి బొటనవేలును కొద్ది నిమిషాల పాటు నొక్కాలని ఇది శరీరాన్ని నిద్రకు సిద్ధం చేయడానికి సహాయపడుతుందని చెబుతోంది జిన్ షిన్.

## మెరుగైన ఇంటి వైపు

ఈ దేశవాసులకు ఈ దేశమే ఇల్లు. ఇక్కడే ఉండాలి. జీవించాలి. కాని ఈ నేల ప్రతి ఒక్కరికీ నివాసయోగ్యంగా ఉందా? ప్రతి ఒక్కరినీ సమానంగా, గౌరవంగా చూస్తోందా? ఏ మహమ్మారో వస్తే వలస కూలీలను ‘మీ ఊరికి పోండి’ అని సాటి మనుషులే తరిమికొడితే ‘ఇంటి వైపు’ నడక సాగుతుందా? మన హైదరాబాదీ దర్శకుడు నీరజ్ ఘెవాన్ తీసిన ‘హోమ్‌బౌండ్’ ఎన్నో సామాజిక ప్రశ్నలు లేవనెత్తుతోంది. వివక్షలను ప్రశ్నిస్తోంది. భారత దేశం నుంచి ఆస్కార్‌కు ఆఫీషియల్ ఎంట్రీగా ఎంపికైన ఈ సినిమా వివరాలు.

# హోమ్‌బౌండ్

మే 21, 2025.

కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో కనీవినీ ఎరగనట్టుగా స్టాండింగ్ ఒవేషన్ ఇస్తున్నారు ప్రేక్షకులు.

సినిమా అయ్యాక లేచి నిలబడి చప్పట్లు కొడుతున్నారు.

ఒక నిమిషం... రెండు నిమిషాలు... చప్పట్లు ఆగడం లేదు... 9 నిమిషాల పాటు చప్పట్లు మోగుతూనే ఉన్నాయి.

ఆ సినిమాలో నటించిన నటీనటులు, నిర్మాత, దర్శకుడు ఉద్వేగంతో కన్నీరు కారుస్తూ ఒకరిని ఒకరు హత్తుకున్నారు.

బహుశా ఆ చప్పట్ల మోత ‘ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా’ను తాకినట్టున్నాయి. 2026లో జరగనున్న 98వ ఆస్కార్ అవార్డ్స్ పోటీకి ‘బెస్ట్ ఇంటర్నేషనల్ ఫీచర్ ఫిల్మ్’ కేటగిరి కోసం ఇండియా నుంచి అఫీషియల్ ఎంట్రీగా ఆ సినిమాను ఎంపిక చేశారు.

పేరు: హోమ్‌బౌండ్.

### అదే దర్శకుడికి అదే గుర్తింపు

‘హోమ్‌బౌండ్’ (ఇంటి వైపు) దర్శకుడు నీరజ్ ఘెవాన్. ఇంతకు ముందు ఇతను తీసిన ‘మసాన్’ సినిమా మన దేశంలోనే కాదు విదేశాల్లో కూడా విపరీతమైన ప్రశంసలు పొందింది. దానికి కారణం ఆ సినిమాలో ఎత్తి చూపించిన వివక్ష, తాత్త్వికత. ఇప్పుడు కూడా అలాంటి వివక్షను, ఆధిపత్యాన్ని దర్శకుడు గొప్ప కళాత్మకంగా, సెన్సిబుల్‌గా చూపించడం వల్లే ‘హోమ్‌బౌండ్’కు ఘన జేజేలు దక్కుతున్నాయి. హాలీవుడ్ దిగ్గజం మార్టిన్ స్కోర్‌సెసి ఈ సినిమాకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఉండటమే కాదు సినిమా విపరీతంగా నచ్చడంతో పొగడ్తలతో ప్రచారంలోకి తెచ్చాడు. ఆ తర్వాత ఫిల్మ్‌ఫెస్టివల్స్‌లో సినిమాకు ప్రశంసలు మొదలయ్యాయి. కాన్స్ తర్వాత టొరెంటో ఫిల్మ్ ఫెస్టివల్‌లో ‘హోమ్‌బౌండ్’ రెండవ స్థానంలో నిలిచింది. ‘మసాన్’ సినిమా సమయంలో కేన్స్‌లో పాల్గొన్న నీరజ్ తిరిగి ఈ సినిమాతో అదే కేన్స్‌లో సగర్వంగా నిలిచాడు.

### నిజ సంఘటన ఆధారంగా...



ఈ సినిమాను నిజ జీవిత సంఘటన ఆధారంగా దర్శకుడు నీరజ్ ఘెవాన్ తీశాడు. 2020లో న్యూయార్క్ టైమ్స్‌లో కశ్మీర్ జర్నలిస్ట్ బషారత్ పీర్ ఒక ఆర్టికల్ రాశాడు. ఒక మిత్రుడి సమాధి పక్కన కూచుని ఉన్న మరో మిత్రుడి ఫొటో వేసి. ‘టేకింగ్ అమృత్ హోమ్’ అనే ఆ ఆర్టికల్ కోవిడ్ కాలంలో సూరత్ ఫ్యాక్టరీల్లో పని చేస్తున్న ఇద్దరు మిత్రులు ఉత్తర్ ప్రదేశ్‌లోని తమ సొంత ఊరుకు బయలుదేరి ఎలా సర్వం కోల్పోయారో. వారిలో ఒక మిత్రుడు చనిపోతే మరో మిత్రుడు కోవిడ్‌కు భయపడకుండా ఆ శవాన్ని ఎలా ఇంటికి చేర్చాడో బషారత్ ఆ ఆర్టికల్‌లో రాశాడు. అది చదివిన నీరజ్ కోవిడ్ సమయాన్ని నేపథ్యంగా ఉంచుతూనే ఈ దేశంలో వ్యాపించిన సామాజిక దుర్నీతులను ముందు వరుసలో పెట్టి ‘హోమ్‌బౌండ్’ను తీశాడు.

### ఇద్దరు స్నేహితుల కథ

‘హోమ్‌బౌండ్’ షోయెబ్, చందన్ కుమార్ అనే ఇద్దరు మిత్రుల కథ. వీరిద్దరూ అట్టడుగు ఆర్థిక పరిస్థితుల్లో ఉన్న యువకులు. చిన్నప్పటి నుంచి వీరు పోలీస్ కానిస్టేబుళ్లు అవ్వాలనుకుంటారు. అందుకై ప్రయత్నిస్తూ నగరంలో అంత వరకూ చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకుంటూ ఉంటారు. కాని ఒకసారి ఊరు విడిచి నగరానికి చేరుకున్నాక ప్రపంచపు పోకడ, మన దేశంలో వేళ్లూనుకుని ఉన్న వివక్ష వారికి అనుభవంలోకి వస్తుంది. చందన్ దళితుడైన కారణంగా అవమానాలు ఎదుర్కొంటుంటే, షోయెబ్ ముస్లిం కావడం వల్ల వివక్షను ఎదుర్కొంటూ ఉంటాడు. ఈ ‘దేశం’ అనే ‘ఇల్లు’ వీరికి ‘కొందరికి’ ఇస్తున్నట్టుగా మర్యాద, గౌరవం ఇవ్వడం లేదు. ‘కానిస్టేబుల్ ఉద్యోగం’ వస్తే అన్ని వివక్షలు పోతాయని వీరు అనుకుంటారుగాని అదంతా ఉత్త మాట... కొందరు ఎంత ఎదిగినా కిందకే చూస్తారని కూడా అర్థమవుతుంది. వీరికి పరిచయమైన అమ్మాయి సుధా భారతి అంబేద్కరైట్‌గా సమాజంలో రావలసిన చైతన్యం గురించి మాట్లాడుతుంటుంది. ఈలోపు పులి మీద పిడుగులా లాక్‌డౌన్ వస్తుంది. అక్కడి నుంచి ఆ స్నేహితులిద్దరూ సొంత ఊరికి బయలుదేరడంతో ఆ ప్రయాణం వారిని ఎక్కడికి చేర్చిందనేది కథ. ఇందులో ఇద్దరు స్నేహితులుగా విశాల్ జేత్వా, ఇషాన్ ఖట్టర్ నటించారు. సుధా భారతిగా జాన్వి కపూర్ నటించింది. కరణ్ జొహార్, అదర్ పూనావాలా (కోవీషీల్డ్ తయారీదారు) నిర్మాతలు. సహజమైన పాత్రలు, గాఢమైన సన్నివేశాలు, దర్శకుడు సంధించే ప్రశ్నలు ఈ సినిమా చూశాక ప్రేక్షకులను వెంటాడుతాయని ఇప్పటి వరకూ వస్తున్న రివ్యూలు చెబుతున్నాయి.

ఆస్కార్ నామినేషన్స్‌ను జనవరి 22, 2026న ప్రకటిస్తారు. హోమ్‌బౌండ్ నామినేట్ అవుతుందని ఆశిద్దాం. మరో ఆస్కార్ ఈ సినిమా వల్ల వస్తే అదీ ఘనతే కదా.

---

నవశక్తి



‘ఆశలు ఉండగానే సరిపోదు ఆశయ సాధనకు కృషి చేయాల్సిందే! అప్పుడే సరైన ఫలితాన్ని సాధించగలం అంటోంది 19 ఏళ్ల కాట్రావత్ అంజలి. సెప్టెంబర్ 1 నుంచి 12 వరకు న్యూఢిల్లీలో జరిగిన ప్రతిష్ఠాత్మకమైన ఆలిండియా తాల్ సైనిక్ క్యాంపులో ఉస్మానియా వర్సిటీ సైఫాబాద్ సైన్స్ కాలేజీ విద్యార్థిని, ఎన్‌సిసి క్యాడెట్ అంజలి ఫైరింగ్ విభాగంలో తన ప్రతిభను చూపింది. పతకాలూ సాధించింది. నవ శక్తికి ప్రతీకగా నిలుస్తున్న మహబూబ్‌నగర్ వాసి అంజలి చెబుతున్న విషయాలు ఆమె మాటల్లోనే..

# ఫైర్ ముఖ్యం



‘‘మా నాన్న నర్సింహ లారీ డ్రైవర్. అమ్మ దుర్గ గృహిణి. పుట్టిందీ, పెరిగిందీ మహబూబ్‌నగర్‌లోని పిల్లలమర్రి. ఓయూ సైఫాబాద్ కాలేజీలో బీఎస్సీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాను. డిగ్రీతో పాటు ఆ కాలేజీలో ఎన్‌సిసిలో సి-సర్టిఫికెట్ చేస్తున్నాను. ఈ యేడాది ఢిల్లీలో జరిగిన టీఎస్సీ (తాల్ సైనిక్ క్యాంప్)లో పాల్గొనే అవకాశం లభించింది. ఇది జాతీయ స్థాయి ఈవెంట్. ఆర్మీ వింగ్‌కి మాత్రమే అవకాశం ఉండే ఈవెంట్ కూడా. ఐయుసి, ఐజిసి, టీ ఆర్జీ.. ఇలా లాంచింగ్ వరకు దశల వారీగా శిక్షణ తీసుకుంటూ, పోటీలో పాల్గొంటూ, సక్సెస్ సాధిస్తేనే టీఎస్సీకి ఎంపిక కాగలం.

### ప్రత్యేక శిక్షణ

నేను పాల్గొన్నది ఫైరింగ్ అప్లికేషన్. దీనికి ప్రత్యేక శిక్షణ ఉంటుంది. ప్రతిరోజూ చేయాల్సిన వ్యాయామాలు, మోటివేషన్ క్లాసులు, ఫైరింగ్‌లో ఏ మోడ్‌పాయింట్ ఎలా తీసుకోవాలనేది శిక్షణలో భాగం. ఉదయం, సాయంత్రం రెండు పూటలా ఉండే ట్రైనింగ్‌తో పాటు రేంజ్ సెషన్స్ దగ్గర ప్రాక్టికల్ సెషన్స్ ఉంటాయి. భుజ బలానికి ప్రత్యేక వ్యాయామాలు ఉంటాయి. స్పోర్ట్స్ సైకాలజిస్ట్‌ల క్లాసులు ఉంటాయి. మానసికంగా ఒకే విషయంపైన ఏకాగ్రత ఉండేలా శిక్షణ ఇస్తారు. పాయింట్ 22 బోర్ రైఫిల్ బరువు 3-4 కేజీలు ఉంటుంది. దీనిని మోయడమే కాదు, అదే సమయంలో ఫైర్ చేయడానికి చాలా శక్తి కావాలి. ఇందుకోసం బలం పెరిగేలా ఆహార నియమాలు, డిప్స్, పుషప్స్, కోర్‌మజిల్ స్ట్రెంథెనింగ్ .. వంటివి రోజూ సాధన చేస్తూ ఉండాలి.

### స్ఫూర్తిని నింపే ఈవెంట్..

జాతీయ స్థాయిలో జరిగే టీఎస్సీలో పాల్గొనడానికి దేశవ్యాప్తంగా ఉన్న 17 డైరెక్టరేట్స్ నుంచి మంచి శిక్షణ తీసుకున్న విద్యార్థులు పాల్గొంటారు. ప్రతి డైరెక్టరేట్ నుంచి 40-50 మందికి పైగా విద్యార్థులు పాల్గొంటారు. ఇందులో మన ప్రాంతం నుంచి నేను పాల్గొనడం చాలా ఆనందాన్నిచ్చింది. జాతీయ స్థాయి శిక్షణ పొందిన విద్యార్థులను కలుసుకోవడం, వారి సంస్కృతి గురించి తెలుసుకోడం, పోటీలో పతకాలు సాధించడమూ చాలా సంతోషాన్నిచ్చింది.

### ఆశ .. ఆశయం

చిన్నప్పటి నుంచి పోలీస్ అవ్వాలని, డిఫెన్స్‌లోకి వెళ్లాలనేది నా ఆలోచన. దానికి తగినట్టుగా నాకున్న ఆసక్తిని గమనించి, మా ఎన్సీసీ అసోసియేట్ ఆఫీసర్ లెఫ్టినెంట్ డాక్టర్ పల్లటి నరేష్ ఆసక్తి ఉందా అని అడిగారు. నా ఆనందం మాటల్లో చెప్పలేను. నాకు ఇష్టమైన రైఫిల్ ట్రైనింగ్‌లో మిస్ కాకుండా పాల్గొనడం మొదలుపెట్టాను. ఈ ట్రైనింగ్ వల్ల కొన్ని నెలలుగా కాలేజీకి దూరంగా ఉండాల్సి వచ్చింది. క్లాసులు, ల్యాబ్స్ మిస్ అయ్యాను. మా లెక్చరర్స్ సపోర్ట్ ఉండటం మరింత బలాన్నిచ్చింది. ఇప్పుడు ఫైనలియర్ కాబట్టి ట్రైనింగ్ తీసుకుంటున్నాను. స్టేట్ పోలీస్ ట్రైనింగ్‌కి అప్లికేషన్ పెట్టుకున్నాను. సెంట్రల్ డిఫెన్స్‌లో పాల్గొనాలనేది నా ఆశ. అందుకు తగిన ట్రైనింగ్ తీసుకుంటున్నాను’’ అని ఆనందంగా వివరించింది అంజలి.

– నిర్మలారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

---

**బులియన్** (బంగారం 10 గ్రా.: వెండి కిలో) సెప్టెంబర్ 22న ముగింపు రూ.లలో

| | హైదరాబాద్ | విజయవాడ | విశాఖపట్నం | రాజమండ్రి | ప్రొద్దుటూరు | చెన్నై |
|---|---|---|---|---|---|---|
| బంగారం (24 క్యారెట్లు) | 1,16,410 | 1,14,500 | 1,13,070 | 1,14,500 | 1,15,200 | 1,13,020 |
| బంగారం (22 క్యారెట్లు) | 1,08,250 | 1,06,300 | 1,03,650 | 1,06,300 | 1,05,980 | 1,03,600 |
| వెండి | 1,39,000 | 1,36,400 | 1,48,000 | 1,36,400 | 1,37,000 | 1,48,000 |

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

---

సాగుబడి

ఉత్తర కార్తె: సెప్టెంబర్ 26 వరకు
హస్త కార్తె: 27 నుంచి

## సేంద్రియ ఉత్పాదకాలపై ఎన్‌ఐపీహెచ్‌ఎంలో శిక్షణ

ప్రకృతి, సేంద్రియ వ్యవసాయంలో ఉపయోగించే అనేక బయో ఉత్పాదకాల (బయో ఇన్‌పుట్స్)ను పొలాల్లోనే తయారు చేసుకొని, పంటలకు వినియోగించుకునే పద్ధతులపై హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని కేంద్ర వ్యవసాయ శాఖకు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్ (ఎన్‌ఐపీహెచ్‌ఎం) 3 రోజుల శిక్షణ ఇవ్వనుంది. అక్టోబర్ 13 నుంచి 15 వరకు జరిగే ఈ శిక్షణను తెలుగు, ఇంగ్లిష్, హిందీలలో బోధిస్తారు. జీవన ఎరువులు, జీవన పురుగుమందులు, ఘన/ద్రవ జీవామృతం, కషాయాలు, ద్రావణాల తయారీతో పాటు మిత్రపురుగులను క్షేత్రస్థాయిలో పెంపొందించుకునే పద్ధతులు నేర్పిస్తారు. 30-40 మందికి అవకాశం. రైతులు, ఎఫ్‌పీవోల సభ్యులు, గ్రామీణ యువతీయువకులు ఈ శిక్షణకు అర్హులు. శిక్షణ రుసుము, వసతి, భోజన ఖర్చులన్నీ కలిపి ఒకరికి రూ. 4,185లు. ప్రకృతి, సేంద్రియ వ్యవసాయంపై లోతైన అవగాహన పెంచుకోవాలనుకునే యువతకు ఈ శిక్షణ ఉపయోగకరం.

**ఇతర వివరాలకు.. డా. బి. శైలజ - 96667 21672.**
**Email:** dirphmniphm-ap@nic.in

## 26, 27 తేదీల్లో కిసాన్ మహోత్సవం

ఏరువాక ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 26, 27 తేదీల్లో గుంటూరు జిల్లా వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్సిటీ ఆవరణలో కిసాన్ మహోత్సవం జరగనుంది. అధునాతన వ్యవసాయ పద్ధతులు, పోకడలపై ఎగ్జిబిషన్, సదస్సులు, చర్చా గోష్ఠులు నిర్వహిస్తారు. 2023, 2024 వార్షిక వ్యవసాయ పురస్కారాలు ప్రదానం చేస్తారు.

**ప్రవేశం ఉచితం. ఇతర వివరాలకు.. 70757 51969**

## అధిక దిగుబడినిచ్చే మిల్కీ మష్రూమ్



భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలికి అనుబంధంగా ఉన్న డైరెక్టరేట్ ఆఫ్ మష్రూమ్ రీసెర్చ్ అధిక దిగుబడినిచ్చే డీఎంఆర్ మిల్కీ-299 అనే కొత్త పుట్టగొడుగుల రకాన్ని అభివృద్ధి చేసింది. ఈ రకం పుట్టగొడుగులు గది ఉష్ణోగ్రతలో 7 రోజులు, ఫ్రిడ్జ్‌లో 15 రోజుల వరకు నిల్వ ఉంటాయని ఐసీఏఆర్ తెలిపింది. విస్తృతంగా సాగులో ఉన్న డీఎంఆర్‌ఓ-985 రకంతో పోల్చితే ఇది 14.5% అధిక దిగుబడినిస్తుంది. దేశీ జన్యువనరులతో ఆధునిక బ్రీడింగ్ పద్ధతుల ద్వారా తయారైన ఈ రకం పుట్టగొడుగుల పెంపకం రైతులకు లాభదాయకంగా ఉంటుందని ఐసీఏఆర్ తెలిపింది. బటన్ మష్రూమ్స్ పెంపకంలో మాదిరిగా నియంత్రిత వాతావరణం కోసం ఖరీదైన ప్రత్యేక మౌలిక సదుపాయాలు దీనికి అవసరం లేదు. స్వల్పఖర్చుతో కూడిన షెడ్లలోనూ 38 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత వరకు పెంచవచ్చని చెబుతున్నారు.

---


సాంప్రదాయ పంటలు పండించే చాలా మంది రైతుల నికరాదాయం ఎకరానికి రూ.20 వేలకు మించటం లేదు. పత్తి, మొక్కజొన్నకు బదులుగా మునగ సాగు చేస్తే సన్న, చిన్నకారు రైతుల నికరాదాయం పెరుగుతుంది. 3 సంవత్సరాలలోపు ఆయిల్‌పామ్ తోటల్లో అంతర పంటగా కూడా మునగను సాగు చేసుకోవచ్చు. వాతావరణ ఒడిదుడుకులను తట్టుకోవటానికి మునగ దోహద పడుతుంది. నాటిన 7-8 నెలల్లో తొలి పంట కోతకు వస్తుంది. మూడేళ్లలో వరుసగా కనీసం 5 కార్శి పంటలు తీసుకోవచ్చు. మునగ ఆకుల పొడి, గింజల ద్వారా అదనపు ఆదాయం సమకూర్చుకోవచ్చు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డా. టి. భరత్, ఉద్యాన శాస్త్రవేత్త బి. శివ, విస్తరణ శాస్త్రవేత్త డా. ఎన్. హేమ శరత్ చంద్ర మునగ సాగుపై అందించిన పూర్తి వివరాలు.



# మునగ మేలు!







**మునగ ఒక్కసారి నాటితే మూడేళ్ల పాటు మునగ కాయల దిగుబడి**
**ఎకరానికి వెయ్యి మొక్కలు.. మొక్కకు 150 కాయలు..**
**మునగాకు, గింజల ద్వారా అదనపు ఆదాయం**
**ఏడాదికి ఎకరానికి రూ.75 వేల ఆదాయం వస్తుందంటున్న శాస్త్రవేత్తలు**

పోషకాల గనిగా పేరు తెచ్చుకున్న మునగ రైతుల పాలిట కల్పవృక్షంగా విరాజిల్లుతున్నది. తినే వారికి ఆరోగ్యం, పండించే వారికి లాభాలు అందిస్తోంది. తక్కువ పెట్టుబడితోనే అధిక దిగుబడులందిస్తూ.. అన్నదాతల ఇంట సిరులు కురిపిస్తున్నది. మునగ చెట్టులో ప్రతీ భాగం ఉపయోగకరమైనదే. ఆకులు, కాయలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వీటి విత్తనాలను ఔషధ పరిశ్రమలలో వాడతారు. అందుకే, వీటికి మార్కెట్‌లో భారీ డిమాండ్ ఉంటుంది. ఆరోగ్యపరంగానే కాకుండా, వ్యాపారపరంగానూ మునగను సాగు చేసేవారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది.

### ఏ నేలలైనా ఓకే

అన్ని రకాల నేలల్లో మునగను సాగు చేసుకోవచ్చు. ఉదజని సూచిక 6.5-8 శాతం ఉండే ఇసుక రేగడి నేలలు ఎక్కువ అనుకూలంగా ఉంటాయి. నీరు నిలవని ఎర్ర, ఇసుక, ఒండ్రు నేలలు అనుకూలమైనవి. నీటి వసతి గల సారవంతమైన భూముల్లో అధిక దిగుబడి సాధించవచ్చు. ఆరు నెలల్లోనే కాతకు వచ్చే ఏకవార్షిక రకాలు అందుబాటులోకి వచ్చాయి.

### అక్టోబర్ వరకు విత్తుకోవచ్చు

మునగ విత్తనంతో మొక్కలు పెంచి, నాటుకోవాలి. జూలై నుంచి అక్టోబర్ వరకు విత్తుకోవచ్చు. ఏ సమయంలో విత్తినా వేసవిలోనే (జనవరి-ఏప్రిల్ మధ్యలో) పూతకు వస్తుంది. ఫిబ్రవరిలో ఎక్కువ పూత, కాత ఉంటుంది. ఒక ఎకరానికి వెయ్యి మొక్కలు నాటాలి. మొక్కలను ముందుగా నర్సరీల్లో పెంచాలి. పీకేఎం-1 మునగ రకం విత్తుకోవటం మేలు. పాలిథిన్ సంచుల్లో విత్తిన 15 రోజుల్లో మొలక వస్తుంది. మొక్కల మధ్య 1 మీ., వరుసల మధ్య 1.5 మీ. దూరంలో గుంతలు తీసుకోవాలి. అర ట్రక్కు పశువుల ఎరువుకు రెండు బస్తాల వేపపిండి, 10 కేజీల ట్రైకోడెర్మా కలపాలి. దీన్ని ప్రతి గుంతకు రెండు దోసెళ్లు (ఒక కిలో), గుప్పెడు సూపర్ ఫాస్పేట్ వేయాలి. ప్రతి మొక్కకూ డ్రిప్ ద్వారా 135: 23: 45 గ్రాముల చొప్పున నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులను అందిస్తే దిగుబడులు పెరుగుతాయి. నత్రజని, పొటాష్ ఎరువులను యూరియా, మ్యూరేట్ ఆఫ్ పొటాష్ రూపంలో డ్రిప్ ద్వారా అందించాలి. డ్రిప్ ద్వారా 10-15 లీ. నీరివ్వాలి. నాటిన తర్వాత 3, 6 నెలలకు నత్రజని ఎరువు వేయాలి. వాస్తవానికి మునగ మొక్కలకు ఎక్కువ ఎరువులు అవసరం ఉండదు. జీవన ఎరువులు కూడా వాడితే నేల సారం, నేల ఆరోగ్యం పెరిగి తెగుళ్ళు రాకుండా ఉంటాయి.



### బొంత పురుగులతో జాగ్రత్త

మునగ కాండంపై బొంత పురుగులు గుంపులుగా చేరి, బెరడును తొలిచి తింటాయి. ఆకులను తొలిచేస్తాయి. దీంతో ఆకు విపరీతంగా రాలిపోతుంది. ఈ సమయంలో పురుగు గుడ్లను, లార్వాలను ఏరివేయాలి. వర్షాల తర్వాత పెద్ద పురుగులను నివారించడానికి హెక్టారుకు ఒక దీపపు ఎరను ఉంచాలి. వేపనూనె మందు ద్రావణం పిచికారీ చేస్తే మొక్కలపై పురుగులకు వికర్షకాలుగా పనిచేస్తాయి.

### ఈ పంటలతో మునగను కలపొద్దు

ఆయిల్ పామ్, పత్తి, కూరగాయ పంటల్లో అంతర పంటగా వేస్తే మునగ మొక్కలు ఎరువులు, నీరు ఎక్కువగా అంది చాలా ఏపుగా పెరుగుతాయి. కానీ, పూలు, కాయలు ఆలస్యంగా రావడం స్పష్టంగా గుర్తించాం. కాబట్టి, అంతర పంటగా వేసినప్పుడు మునగ మొక్కలకు ఎక్కువ నీరు, ఎరువులు అందకుండా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఎక్కువ చీడపీడలు ఆశించే టమాటా, వంగ, మిర్చి పంటలను మునగలో అంతర పంటలుగా వేసుకోకూడదు. ఎరువులు, సస్యరక్షణ చర్యలు తక్కువ అవసరమయ్యే కూరగాయ పంటలను మాత్రమే వేసుకోవాలి. లేకపోతే మునగ దిగుబడి తగ్గిపోతుంది. పొలంలో మురుగు నీరు చేరకుండా చూసుకోవాలి.

### కత్తిరించిన 4-5 నెలల్లో మళ్లీ కాపు

మునగ నాటిన మొదట్లో ప్రతి 2 నెలలకోసారి (6 నెలల్లో 3 సార్లు) విధిగా కొమ్మలు కత్తిరిస్తే.. కొమ్మలు గుబురుగా వచ్చి పూత, కాయల దిగుబడి ఎక్కువగా వస్తుంది. పక్క కొమ్మలు రాకుండా ఏపుగా బాగా ఎత్తు పెరిగితే పూత సరిగ్గా రాదు. భారీ వర్షాలు, ఈదురు గాలులకు మొక్కలు పక్కకు పడిపోయి విరిగిపోతాయి. మొదటి కాయ కోత తర్వాత భూమట్టం నుంచి 90 సెం.మీ. ఎత్తులో మొక్క కాండం, కొమ్మలను కత్తిరించాలి. దీంతో 4-5 నెలల్లో చెట్టు మళ్లీ కాపు కొస్తుంది. మూడు సంవత్సరాల వరకు ఇలా 4-5 నెలలకొకసారి కార్శి పంటలను తీసుకోవచ్చు. కత్తిరించిన వెంటనే మొక్కకు 45, 15,30గ్రాముల చొప్పున నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులు వేయాలి. 30 గ్రాముల చొప్పున నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులు వేయాలి. ఏటా 25 కిలోల చొప్పున బాగా చివికిన పశువుల ఎరువు వేయాలి.

### ఎకరానికి ఉత్పాదకాల ఖర్చెంత?

| కావలసినవి | ఖర్చు (రూ.) |
|---|---|
| 1 కేజీ విత్తనం | 2,000 |
| 1,000 పాలిథీన్ సంచులు | 1,294 |
| నగం ట్రాక్టర్ ట్రక్కు మట్టి, ఇసుక | 600 |
| ఒక ట్రాక్టర్ ట్రక్కు పశువుల ఎరువు | 2,500 |
| 100 కేజీల వేప పిండి | 1,500 |
| 6 కేజీల ట్రైకోడెర్మా జీవన ఎరువు | 600 |
| 4 లీటర్ల వేప నూనె | 2,400 |
| 40 కేజీల జిప్సం | 400 |
| 4 బస్తాల యూరియా | 1,070 |
| 2 బస్తాల పొటాష్ | 3,000 |
| 5 బస్తాల సూపర్ ఫాస్ఫేట్ | 1,810 |
| అర లీటరు రీజెంట్ | 400 |
| దీపపు ఎరలు | 300 |
| సాగు ఖర్చు (కౌలు/దుక్కి/కూలి మినహా) | 17,874 |

### మొక్కకు 150 కాయలు

ఒక ఎకరానికి 1,000 మొక్కలు నాటితే ప్రతి మొక్కకు కనీసం 150 కాయల చొప్పున 1,50,000 కాయలు కాస్తాయి. రూపాయికి 2 కాయల చొప్పున (ఒక కేజీకి రూ.5) స్థానికంగా అమ్మితే.. ఎకరానికి ఏడాదికి రూ.75,000 ఆదాయం వస్తుంది. మునగ ఆకులను కోసి ఎండ బెట్టి పొడి చేసి అమ్మొచ్చు. మునగ గింజలు/నూనె ద్వారా అదనపు ఆదాయం వస్తుంది.

### మునగ ప్రకృతి సేద్యం ఇలా..

మునగ పంటను ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తే ఖర్చులు తగ్గి, నేల ఆరోగ్యం మెరుగుపడి, మంచి దిగుబడులు వస్తాయి. ప్రకృతి వ్యవసాయ పద్ధతి మునగ సాగుకు బాగా అనుకూలం. భూమిని లోతుగా దున్ని సూర్య కాంతికి ఎండబెట్టాలి. గోతులు తవ్వి, ఎండిన ఆకుల చెత్త, పశువుల ఎరువు, ఘనజీవామృతం లేదా వర్మీ కంపోస్ట్ కలిపి గోతులను నింపాలి. సేంద్రియంగా సాగు చేసిన విత్తనాలను మాత్రమే వాడాలి. విత్తనాలను బీజామృతంలో శుద్ధి చేసిన 24 గంటల తర్వాత విత్తాలి. మొక్కలకు జీవామృతం లేదా గోమూత్ర ద్రావణం వాడాలి. ద్రవ జీవామృతాన్ని 15 రోజులకు ఒకసారి ఇస్తూ ఉండాలి. డ్రిప్ ద్వారా నీరివ్వాలి. వర్షాకాలంలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. వేపనూనె, అగ్ని అస్త్రం, బ్రహ్మాస్త్రం వంటి కషాయాలను తయారు చేసి పిచికారీ చేయాలి. పచ్చి రొట్ట పంటలను పెంచి, కత్తిరించి, మొక్కల మొదళ్ల చుట్టూ మల్చింగ్‌గా వెయ్యాలి. కలుపు సమస్య తగ్గుతుంది. ఉత్పత్తి ఖర్చు 30-40% తగ్గుతుంది. ప్రకృతి వ్యవసాయంలో పండించిన మునగ కాయలు రుచిగా, పోషకాలు అధికంగా ఉండి, ఎగుమతులకు అనుకూలంగా ఉంటాయి.

**ఇతర వివరాలకు.. డా. టి. భరత్ - 97005 49754**